
# ఆనాటి రాత్రి



శ్రీ శ్రీవత్స

"అసలు రజస్వల అయినతర్వాత అన్నాళ్ళవరకూ కార్యము చేసుకోకుండా వుండడము నాదే తప్పు. ఇప్పుడేమనుకొని ఏం ప్రయోజనం. అయిపోయింది. అంతే మూడు సంవత్సరాలు వ్యవధానం యిచ్చేసరికి కాస్త... కాస్తేమిటి - బాగా అనుభవము సంపాదించింది. అందులో బస్తీలో పెరిగిన పిల్ల. పట్టపగ్గాలుంటవా? రెండు వారములయినా కాలేదు. ఎన్నడో సంవత్సరాల పర్యంతము కాపురము చేసినదానిలాగా అతిచనువుగా అతిఖులాసాగా తయారవుతూవుంది. పూర్వానుభవమే లేకపోతే యీ విధంగా ప్రవర్తించగలదా?..." అని తీవ్రముగా ఆలోచిస్తున్నాడు సుబ్బయ్య. దేహమంతా అట్టుడికినట్టు వుడికిపోతూవుంది. కూర్చోలేకపోయినాడు. లేచి అటూ ఇటూ పచారు చేయడము మొదలుపెట్టినాడు. కర్తవ్యము నిర్ణయించడానికి బాధపడుతున్నాడు. మెల్లిగా ఏదో విధముగా అత్తవారింటికి భార్యను తీసుకొని వెళ్లి దిగబెట్టి తానిక ఏదో దారిచూసుకోడము వుత్తమనుకొన్నాడు. ఆ మాసములో ఏదయినా పండగో పర్వమో వుంటే పెళ్లాన్ని అమిషతో మెల్లిగా అత్తవారింటికి దారిపట్టించవచ్చునను కొని కాలెండరు అంతా చూసినాడు. ఆ మాసములో అమావాస్య పౌర్ణమి తప్ప ఒక్క పండగయినా కనిపించలేదు.

"వెధవ కాలెండరు. పండగలు వేయలేదు. పంచాంగములో ఒక్క పండగయినా దొరకక పోతుందా?" అనుకొని పంచాంగముకోసం యిల్లంతా వెదికినాడు. ఆ జన్మ పుణ్యకాలానా పంచాంగముకొన్న పాపము చేస్తేకాదూ! మళ్లీ యింకొక సందేహము వచ్చింది. "తీరళ్లా బజారు పోయి పంచాంగము కొనుక్కు వచ్చినా [illegible] తెలియదే! ఏమిటి చేయడము. మనస్సంతా [illegible] లూగుతూంది. అరెరె ఎంత తెలివి తక్కువయిపోయింది - పొద్దున పంచాంగం బ్రాహ్మణ్ణి అడిగినట్టయితే యీ చిక్కు లేకుండా పోయేదికదా?... ఇక రేపు పొద్దుటిదాకా పండగసంగతి తెలియకపోతే బ్రదకడమెట్లా? ఇక పురోహితుణ్ణి కనుక్కోవలసిందే [illegible] అనుకొని [illegible]టికి బయలుదేరడానికి చొక్కా గిక్కాకోసం పెట్టె సవిరిస్తున్నాడు సుబ్బయ్య.

అప్పుడు సాయంత్రము మూడుగంట లవుతుంది. శాంతమ్మ కాఫీ - ఉప్మా తయారుచేసి తలాగిలా కాస్త చక్క చేసుకొని అద్దంచూసుకొని చప్పున దొడ్లోకిపోయి నాల్గు చంద్రకాంతపు పూలు గబగబ తలలో దూర్చుకొని వచ్చి పీటవేసి - తన పెట్టెలోనుంచి వెండికంచమూ వెండి గ్లాసూ వెండికప్పూ సాసరూ తీసి పీటముందు వుంచి - కాఫీ చల్లారిపోయిం దేమోనని చూసి అది మళ్లీ సన్నటి సెగమీదవుంచి - మళ్లీ తనచీరే తానూ ఎట్లాఉన్నదీ ఒక్కసారి కిందినుంచి పైకల్లా మాసుకొని కొంత సంతృప్తి పడి పక్కగదిలో వున్న భర్తదగ్గిరకు పోయింది.

సుబ్బయ్య ఆమెను ఎగాదిగా వెర్రిగా - ఎర్రగుడ్లను చూస్తూవుంటే వుండే గెదే గొడ్డులాగా ఆమెను చూడసాగి నాడు. అతని ధోరణి ఆమెకేమీ బోధపడింది కాదు. ఆమె తనసహజ పద్ధతితో కొంచెము సిగ్గూ కొంచెము ఉత్సాహమూ అభినయిస్తూ "ఏమండి కాఫీకి రారూ. చాలాసేపు అయింది" అన్నది. అతనేమీ మాట్లాడ కుండా లేచి వెళ్లి పడకకుర్చిలో జారిగిలబడి మళ్లీ ఆమె వంక వెర్రిగా చూడసాగినాడు. ఆమెకు అతని ప్రకృతి విపరీతముగా తోచింది. అయితే తనవల్ల ఏదయినా లోపంవచ్చిందేమో నని అనుమానంపుట్టి తన్ను తాను పరీక్ష చేసుకోడం మొదలుపెట్టింది. ఆమెకు తెలిసినంత వరకూ ఆమె ఏవిధమయిన అపచారమూ చేసినట్టు తోచలేదు.

అయితే ఆమెవెంట వచ్చిన ముసలమ్మ వెళ్లిపోయిన రెండు రోజులనుంచీ కూడా పెనిమిటి ఏదో గొడవగానే వుంటున్నట్టు తోచింది. కారణము మాత్రము వూహించ లేకపోయింది. అట్లాగే చూస్తూ అమాయకంగా నిలు చున్నది. పెనిమిటి కొంతసేపయిన తర్వాత హఠాత్తుగా "ఈ నెలలో ఏవయినా పండగ లున్నవా?", అని కొంచెము ఆదరముగా ఆమెను ప్రశ్నించినాడు.

ఆమెకు కొంచెం హుషారువచ్చింది. నవ్వుతూ "మీరు కాఫీకివస్తే చెబుతాను" అన్నది.

సుబ్బయ్యకు కోపమువచ్చింది. కాని కోపము అణుచు కొని లేచినాడు. పీటమీద కూర్చుని "ఏమిటి పండగలు?" అన్నాడు. ఆమె గబగబ వుప్మా ఆ కంచములో పడవేసి "ఎందుకో చెపితే చెబుతాను?" అన్నది. ఆ ప్రశ్నకు ఆపాద మస్తకమూ భగ్గున మండిపోయింది సుబ్బయ్యకు. నోట్లో ఒకటి రెండు కబళాలయితే పడ్డవికాని అతని అను మానము యింకా యెక్కువయి పోయింది. 'దీనికి భయమూ భక్తీ లేకుండా ఎట్లాపడితే అట్లా ప్రశ్నలు వేస్తుంది. నిజంగా దీనికేదో పూర్వానుభవము వుండి తీరవలెను. పయిగా మొగుడనే లక్ష్యమయినా లేదు" అని తోచింది. చటుక్కున లేచినాడు. ఆమె అతన్ని పట్టుకొని 'ఏమండీ- ఎందుకండీ అంతకోపం. నేనేమన్నానండి... నా తప్పేమి టండి?" అన్నది. అత నామెను విదిలించివేసి వెళ్లిపోయి మళ్లీ తనగదిలో కుర్చీలో కూర్చున్నాడు.

శాంతమ్మకు ఏడుపువచ్చింది. ఏమీ తోచలేదు. ఆ వెండిపళ్లెము వగయిరా అంతా తీసుకొని అతనున్న గదిలోకి వెళ్లి బల్లమీదపెట్టి బిక్కమొహముతో అతనితో "ఏమండీ మీకు వుప్మా యిష్టమని చేశాను. మీరు తినక పోతే ఎట్లాగండీ" అంటూ సమీపించి "కొంచెము తిందురూ..." అంటూ పళ్లెము చేతికిచ్చింది. ఆమె బిక్క మొహమూ ఆమె బ్రతిమలాడడమూ చూచి కొద్దిగా చల్లబడి "అయితే ఈమాసంలో ఏం పండగలు వస్తవో చెప్పు" అన్నాడు.

ఆమెకు నవ్వువచ్చింది. ఎట్లాగో నవ్వు ఆపుకొని "ఈ మాసములో ఒక్క పండగయినా రాదండీ" అన్నది.

"ఒక్క పండగయినా రాదూ. ఒక్కటి ఒక్క పండగ?"

"లేదండి. అయినా పండగ ఎందుకో చెప్పరూ?"

"మీయింటికి వెళుదామని బుద్ధిపుట్టింది. ఇక్కడ నాకేం తోచడంలేదు, అందుకోసం ఏదయినా పండగవస్తే పండుగకు మీవాళ్లు పిలవనయినా, పిలుస్తారు. లేదా మనం వెళ్లినా పండగకు వచ్చారనుకొంటారు."

శాంతమ్మ నిర్ఘాంతపోయింది. పెనిమిటి యిట్లా అనడ ములో ఏదో కొంత ప్రమాదమున్నట్టుగా ఎంచుకొన్నది. అయితే తొందరపడకుండానే "మావాళ్లు వుండమని ఎంతో బలవంతముచేస్తే ఒక్కగంటఅయినా ఉండడానికి

వీలులేదని మీరు పట్టుబట్టినారు. మళ్లీ యిప్పుడే మనం పోతే బాగుంటుందా?" అన్నది.

"ఏమయినా కానీ... మనం సాధ్యమయినంత త్వరలో ఏదో మిషపెట్టుకొని వెళ్లితీరాలి"

"వద్దులెండి. ఒక నెలరోజులయినా పోనీయండి."

"అవునవును. నీ వట్లా అంటావని నాకు తెలుసునులే..."

"ఎందువల్లనండి"

"ఎంత సంగనాచివి. నాకంతా అర్థమయిందిలే. అదంతా యెందుకుగాని యిప్పుడేమయినా పండగవుందో లేదో చెప్పు"

"పండగలేమీ లేవు"

"అబద్ధ మాడకు"

"ఎల్లుండి శనివారము పౌర్ణమి నాడు చంద్రగ్రహణము. అదితప్ప యింక పండగలేమీ యీ మాసములో లేవండి"

"అయితే మరీ మంచిది. పయిగా సముద్రము వుంది కదూ మీవూళ్లో. రేపు ఉదయము ప్రయాణము. నీ సరంజామా అంత కట్టివేయి"

"మళ్లీ రాముట్లుండీ?"

"ఇంకా మళ్లీ ఎందుకు? నీ సంగతి మొదటిరోజే తెలిసిపోయింది. ఏదో వెర్రివాణ్ణి - వెర్రి ఆలోచనలో పడిపోయి తీసుకొని వచ్చాను"

"అదేమిటండి"

"అవునండి. నాకు తెలుసునండి. తాము ఎంత అమాయకంగా మాట్లాడినా నాకు తెలియ దనుకొన్నారు కాబోలు"

"ఏమిటండి నేనేమి చేశానండి"

"చేసినదానికి నీకు తెలుసును. ఆ సంగతి నా నోటి మీదగా అనడ మెందుకు?"

"అయితే నేనేం చేశానండి?"

"నాచేత చెప్పిస్తేనేగాని నీకు తృప్తికాదు గాబోలు"

"నేనేదో చేశానంటూ చెప్పడానికి మీకెందుకండి అంత భయం?"

"నాకేం భయం? చేసినదానికి నీకే భయములేక పోతేనూ?"

"అయితే చెప్పండి నేనేంచేశానో? మీరు చెప్పక పోతే నేను బయలుదేరనే బయలుదేరను. ఎవరయినా విన్నా నవ్విపోతారు. మనమువచ్చి వడసారము పదిహేను రోజులయినా కాలేదు. అప్పుడే నన్ను తీసుకొని మా యింటికి వెళ్లడ మేమిటండి?"

"ఎందుకు నీకంత భయము?"

"నాకేం భయము!"

"అయితే ప్రయాణము రేపు ఉదయమే"

"ఎందుకో చెప్పదురూ యింత తొందరగా మనము ప్రయాణము కావడము?"

"నిన్ను మీ యింట్లో వదిలిపెట్టి నా దారి నేను చూసుకొంటాను"

"అదేమిటండి? లా చదువుతామని మీరంటే మా నాన్న సరే నన్నారు కాదూ... జులయిలో మనం మద్రాసు వెళ్లేముందు యింకా కాకపోతే మావాళ్ల యింటికి వెళ్లి ఒకవారము రోజులుండి పయికము తీసుకొని వెళుదాము"

"పిల్లికి బిచ్చంపెట్టని మీనాన్న నా చదువుకు డబ్బు యిస్తానంటే నేను అప్పు డాశ్చర్యపడ్డాను. ఇప్పుడు తెలిసిందిలే?"

"ఏమిటండి వూరికా యిందాకటినుంచీ తెలిసిందంటారు. ఏమిటండి మీకు తెలిసింది?"

"నీ సంగతి!"

"ఏమిటండి నా సంగతి"

"సిగ్గులేకుండా అడుగుతావేమిటి?"

ఈ మాటకు శాంతమ్మకు ఏడుపువచ్చింది. ఇంక ఏమాత్రము కదిలించినా పెద్దపెట్టున ఏడ్చేస్థితిలో వుంది. ఏదో మొండిధయిర్యముతో యింతసేపూ మాట్లాడింది. కాని ఆమెకు కోపమూ శోకమూ అత్యుత్కటమయి పోయినవి. ఇక ఒక్కక్షణము సుబ్బయ్యదగ్గిర వుండ

డానికి మనస్కరించలేదు. మొదటిరోజు ... అతని పద్ధతేమిటో విరుద్ధంగా తోచింది. అతను తినివేసిన పళ్లెమూ కాఫీ కప్పూ ఏడ్పుమొఖముతోనే తీసుకొని లోపలికి పోబోతున్నది. అతను ఆమెను తీవ్రముగా చూస్తూ "సంగతి నాకు తెలిసిందని ముఖము తప్పించవలె ననుకొంటువున్నావులే. నాకు తెలుసు. సరేపో." అన్నాడు.

ఈ మాటతో కంఠగతమయి - నేత్రగతమయివున్న దుఃఖము కాస్తా పయికిపొంగి పొర్లడను మొదలు పెట్టింది. కళ్లనీళ్లు తుడుచుకొంటూ గద్గదముతో "ఏమిటండి? ఏమిచేశానండి?" అన్నది శాంతమ్మ.

ఆమె శోకానికి అతని హృదయముకూడా కాస్త ద్రవించింది. అతనామెను పరిశీలించి చూసేసరికి అతనికి తెలియకుండానే ఒకవిధమయిన జాలి కలిగింది. అతని ముఖభంగి మాత్రము మారలేదు. ఆమెకు క్షణక్షణానికి విచారము హెచ్చయిపోతూవుంది. మళ్లీ అతనివంక అత్యంత విచారముతో చూస్తూ "చెప్పరూ నేనేంచేశానో చెప్పరూ... నావల్ల నేరమేమిటో చెప్పరూ" అన్నది.

అతను కరిగిపోయినాడు. "నిజము ఒప్పుకొంటానంటే చెప్తాను" అన్నాడు సుబ్బయ్య.

ఆమెకేమి చెప్పవలెనో తోచలేదు. పయిగా కోపము కూడా వచ్చి "నేను మీతోయేమి అబద్ధము చెప్పానూ?" అంది.

"అదంతా ఎందుకు? నిజము ఒప్పుకొంటానంటే చెబుతాను"

"సరే. నిజమయితే ఎవరయినా ఒప్పుకోక తప్పదు"

"అవును ముందర కాళ్లకు బంధాలు వేస్తున్నావు"

"నేనేమీ బంధాలు వేయడము లేదు. మీరే యిందాకటి నుంచి బంధాలు వేయవలెనని చూస్తూ వున్నారు. అయినా యెందుకీ అనవసర ప్రసంగమంతానూ... విషయ మేమిటో చెప్పండి"

"చెబుతానులే"

"చెప్పండి మరి"

"ఏం అంతతొందర?"

"అవును తొందరే - మధ్యాహ్నము నుంచీ నన్ను ఏడిపించుకొని తింటూ తొందరంటూ రేమండి"

"నీవు ఒప్పుకొంటే మన్నిస్తాను. లేకపోతే నీ కర్మం"

"ప్రాణము విసుగెత్తి పోతున్నది. ఆ సంగతేమిటో కాస్తా చెప్పండి."

"నీకు. నీకు..." అంటూ ఆమె వక్షఃస్థలము వంక చూడసాగినాడు.

శాంతమ్మకు అప్రయత్నంగా నవ్వువచ్చి "ఏమిటండీ. నీకు నీకు అంటారు. నాకేమిటి వచ్చిందో చెబుదురూ?" అంది.

అతనికి కోపమువచ్చింది. కోపముతో "నీకెంత అనుభవమున్నదా అని ఆలోచిస్తూ వున్నాను" అన్నాడు.

"ఏమి అనుభవమండి"

"ఏమి అనుభవమా... ఇంకా అడుగుతున్నావూ... ఎంతదానివి! నన్ను వెర్రివెధవాయకింద కట్టివేసినావు."

"మీమాటలేమిటో మొదటినుంచి నాకు బోధపడడము లేదు. నాకర్థమయ్యేట్టు తెలుగులో చెప్పండి."

"తెలుగులోనే చెపుతాను..."

"చెప్పండి. ఏమిటో! మీకేదో వెర్రీ పిచ్చీ యెత్తినట్టుంది"

"వెర్రివాణ్ణే అయిపోయినాను"

అయిపోతే అయిపోయినారు లెండి... నా అనుభవమేమిటో నా కర్థమయ్యేట్టు చెప్పండి."

"చెపుతాను. ఎందుకు చెప్పను. చెప్పకుండా దాచిపెట్టడము మాయింటా వంటా లేదు..."

ఆమె అతి తీక్షణముగా అతన్నిచూస్తూవుంది.

"నీవు యిదివరకే... యిదివరకే సంగతి సందర్భాలు అన్నీ తెలుసుకొన్నావు కాదూ"

"అంటే" అని ఆమె చిరునవ్వుతో అన్నది.

"అంటేనా... స్త్రీ పురుషవ్యవహారము"

"అయితే"

“ అయితే లేదు. గియితేలేదు. ఒప్పుకొన్నావు. ఎంత నిర్భయం నీకూ !

శాంతమ్మ ఖంగారు పడిపోయి “ ఏమిటండీ - నేనేమి ఒప్పుకొన్నాను, మీరేమిటన్నారు ?” అని ప్రశ్నించింది.

“ ఇప్పుడే ఒప్పుకొన్నావు - స్త్రీపురుష సంబంధాన్ని గురించి తెలుసునని. ఇంతలోకే యెందుకు మాటలు మార్చడానికి ప్రయత్నం చేస్తావు ?”

“ మీకుమాత్రము తెలియదుటండీ !” అని కొంచెము వుత్సాహముతో అన్నది.

“ నాకు వూహా మాత్రముగానే తెలుసును. నీకట్లా కాదు. నీ కిదివరకే బాగా అను[illegible]ముగా తెలుసును ”

“ మీరు పిచ్చపిచ్చగా మాట్లాడకండి. మా వంశము యెట్లాంటిదో నేను యెట్లాంటిదాన్నో మీకు తెలియదు. నన్నిట్లాంటి మాటలంటే నాశనమయిపోతారు ” అని అన్నది శాంతమ్మ.

ఆమెకళ్లు తక్షణమే ఎర్రబడి పోయినవి. ఆమె ముఖము గండుబారి పోయింది. ఆమె వణికిపోతూవుంది.

“ అయితే యింతకూ నీ కిదివరలో ఎవరితోనూ పరాయి వాడితోనూ సంబంధము లేదంటావు ”

“ ఛా ఛా... మీనోటివెంట యిట్లాంటి మాటలెట్లా వచ్చినవండి ?... నేను మీ మాటలు భరించలేను ”

“ నేను నమ్మను. ఎంతమాత్రమూ నమ్మను ”

ఆమె ఏడుపు ప్రారంభించింది. వెక్కి ఎక్కి ఏడుస్తూ “ అయ్యో, అయ్యో, నన్నిట్లాంటి మాటలంటారుటండీ... మీకెవరు చెప్పారండీ అయ్యో - అయ్యో—” అన్నది.

“ నాకెవరూ చెప్పలేదు. నేను ఒకరుచెపితే నమ్మే వాణ్ణికాను. స్వయంగానే నీ సంగతి అంతా కనిపెట్టాను ”

“అయ్యో-అయ్యో మరీ అన్యాయం...కలఏమోనండి”

“ కలగాదు. నిజంగానే తెలుసుకొన్నాను ”

అత్యంత కోపముతో “ ఏంతెలుసు కొన్నారండీ - ఎప్పుడు తెలుసుకున్నారండి ”

“ ఆనాడు రాత్రే...”

“ ఏనాడు రాత్రి అండి ”

“ [illegible] కార్యమయిన మొదటినాడు రాత్రే ?”

“ అదేమిటండి... నేనేం చేశానండి ?”

“ ఎందుకంత అమాయకముగా మాట్లాడుతావు. నాకా మాత్రం తెలియదనుకున్నావు కాబోలు. నీ హుషారుకీ నీ చలాకీకి అప్పుడే నాకు తోచింది... నీ కదివరలోనే అను భవము లేకపోతే అట్లా ప్రవర్తించలేవు ”

అంత విచారములోనూ ఆమెకు ఒక్కసారిగా సిగ్గూ - నవ్వూ వచ్చి “ అయితే సరేలెండి. అట్లాఅయితే సరే లెండి... మీ యిష్టము వచ్చినట్టు అనుకొని సంతోషించండి...” అంటూ ఎంతో ధయిర్యముగా - నిర్భయంగా వుత్సాహాతిశయముతో - ఒక్క క్షణలేశమయినా అక్కడ నిలుచోకుండా మెరుపులాగా అంతర్ధానమయి పోయింది.

ఈ విధంగా యింత చులకనగా - యింత నిర్లక్ష్యముగా పయిగా మందహాసము చేస్తూ ఆమె చటుక్కున పారి పోవడము సుబ్బయ్యకు అర్థముకాలేదు, సముద్రపు యీతలాగా అయింది అతనిపని. ఆ మొదటిరోజు రాత్రి జ్ఞాపకం రావడము మొదలు పెట్టింది. ఆరాత్రి తనకేమి చేయవలెనో తెలియక తికమక పడ్డడమూ ఆమె మంద హాసము చేస్తూ అతి తెలివితేటలతో కార్యక్రమోపదేశము చేయడమూ మొదలయిన విషయాలన్నీ యిట్టే కళ్లయెదట పొడగట్టినవి. పయిగా తెలుగు బజారులలో దొరికే కామ శాస్త్రములలో చెప్పినట్టుగా ప్రథమ సంసర్గములో గుడ్డ లేమీ చెడిపోలేదు.

“అయితే అదివరలో ఏమీ అనుభవము లేకపోతే అట్లా ఎట్లా ప్రవర్తించ గలుగుతుంది ?... పయిగా నిలవ[illegible] అడిగితే అంత నిర్భయముగా వెళ్లిపోయింది. పయిగా నవ్వుతుంది కూడానూ. ఏమయి వుంటుంది ? అసలు రజ స్వల అయిన తర్వాత మూడు సంవత్సరాలు వుంచడమే తప్పు. సరే యిప్పుడా విషయం ఆలోచించి ప్రయోజనం లేదు. ఈ విషయం అంతా ఎట్లా దీనికి తెలుసును ?” అనే దీర్ఘాలోచనలో పడ్డాడు. ఇక నయానో భయానో ఆమెనే అడిగి తెలుసుకోవలెనని నిశ్చయించినాడు.

సాయంత్రము అయిదున్నర అవుతుంది. సూర్య భగవానుడికి కాస్త వృద్ధాప్యము వచ్చినట్టుగా వుంది.

కాస్త చల్లబడ్డది. గాలి ఆటే జోరుగా లేకపోయినా ఉక్కా గిక్కా పోయకుండా హాయిగా వుంది. ముసి ముసి నవ్వులతో శాంతమ్మ సుబ్బయ్య గదిలోకి తొంగి చూసింది.

“ఇదుగో శాంతా, ఒకసారి యిట్లారా?” అన్నాడు సుబ్బయ్య. ఆమె సహజ గజగమనముతో వచ్చి ఆసన శుద్ధిగా అక్కడవున్న కుర్చీలో కూర్చుని అతనివంక ఖులాసాగా చూచింది. సుబ్బయ్య కేవలము తికమక పడుతున్నాడు. ఏదో అడగవలెనను కొంటాడు. కాని నోటివెంట మాట పెగలదు. కంఠముదాకా వచ్చి ఆగి పోతూంది. చివరకు ఎట్లాగయితేనేమి గొంతు సవరించుకొని “చెప్పవూ - నిజము చెప్పవూ” అన్నాడు.

ఆమె ఒకనవ్వు నవ్వి “ఏమిటండీ చెప్పేది? మీకేదో చాదస్తం పట్టినట్టుంది” అన్నది.

“నీవు నిజంచెపితే సరే... లేకపోతే నాదారి నేను చూసుకొంటాను”

“ఏమిటండీ మీదారి మీరు చూసుకొంటామంటారు? పయిగా ఏదో చెప్పమంటారు! సిగ్గు చేటు... మీరు అయోమయంగా వుంటే నేను మిమ్ములను ఖులాసా పెడితే నన్ను అల్లరి చిల్లరి దానికింద కట్టివేశారూ”

“అవును. నీ కదివరకు అనుభవము లేకపోతే...”

“ఛా ఛా మాట్లాడకండి. ఎవరయినా వింటే నవ్వి పోతారు.”

“నీవు వేయి చెప్పు - లక్ష చెప్పు. నేను...

“అబ్బ తెలివితక్కువ. ఇంత తెలివితక్కువవారు బి. ఏ. ఎట్లా ప్యాసుఅయినారండి”

“నీవేశాకోళము కట్టిపెట్టు - నాకు నమ్మకములేదు... ఇక నేనొక్క క్షణము యీ యింట్లో వుండను. వెళ్లి పోతున్నాను.” అంటూ అతి కోపముతో లేచి వుత్తరీయము వేసుకొని పెట్టెలోవున్న మనీపర్సు తీసుకొని జేబులో పెట్టుకొని బయలుదేరినాడు. అతను వరండా దిగేవరకూ శాంతమ్మ శాంతంగానే కూర్చుంది. వీధిలోకి వెళ్లినాడని తోచగానే చివాలున లేచి “ఏమండోయ్ - ఏమండోయ్” అని పిలిచింది.

“నేనికరాను” అన్నాడు.

“ఒక్కమాట వినిపొండి” అని అంది.

సుబ్బయ్య లోపలికివచ్చి నిలుచుని “ఏమిటామాట” అని ప్రశ్నించినాడు.

“ముందు కూర్చోండి” అన్నది. అతను కూర్చున్నాడు.

“అయితే ఏం చెప్పమంటారో చెప్పండి?”

“మళ్లీ మొదటికి వచ్చావు...నీకీ సంగతి సందర్భాలన్నీ ఎట్లా తెలుసునో నిజంచెప్పు.”

“నాకు సిగ్గువేస్తున్నదండి”

“అవును. చెప్పడానికి మాత్రము సిగ్గువేస్తుంది!”

“ఏమిటండి ఆ మాటలూ...”

“అయితే వెళ్లిపోతున్నాను”

అని లేవబోయినాడు.

“అయితే చెబుతాను...అప్పుడే - అప్పుడు...”

“ఎప్పుడు?”

“అంటే మనకు పెళ్లిఅయిన రోజులలో నండి. మా నాన్న రాజమంద్రములో వుంటూ వుండేవారు జ్ఞాపకము లేదూ...”

“అయితే ఏమంటావు?”

“మా బావ రాజమంద్రము కాలేజీలో చదువుకొంటూ వుండేవాడండి”

“అవును. అయితే”

“మీరట్లా తొందరపెడితే నేను అసలు చెప్పను”

“అయితే మెదలకుండా వూరుకొంటాను. మరి చెప్పు”

“మా బావ మాయింట్లోనే వుండేవాడు”

“సరే తెలుసు”

“అదుగో మళ్లీ అడ్డం వస్తున్నారు. రాత్రి తొమ్మిది గంటలదాకా మాబావ హాలులో దీపందగ్గిర కూచుని చదువుకొనేవాడు. ఆపాళంగా లేచి గదిలోకి వెళ్లేవాడు. ఆయన గదిలోకి వెళ్లిన కాస్సేపటికల్లా మా అక్కయ్య కూడా ఆగదిలోకి వెళ్లేది. వాళ్లు తలుపు గడియవేసుకొనే వాళ్లు. ఒక్కొక్కనాడు మా అక్కయ్య గదిలోకి

ల్లేదికాదు. మా అమ్మ చూసి కోపపడీ బుజ్జగించీ ఎట్లాగయితేనేమి ఆ గదిలోకి అక్కయ్యను పంపించేది. ఎందుకు అమ్మ అట్లా చేసేదో నాకు బోధపడలేదు. నేను మా అమ్మదగ్గిర పడుకొనేదాన్ని. వాళ్లేమి చేస్తారో చూదామని అనిపించేది. నేను లేస్తే మా అమ్మ కోపపడేది. అందువల్ల చూడవలెననే బుద్ధి యెక్కువయి పోయింది. ఒకనాడు ఏమయినా సరే ఎంత రాత్రి అయినా సరే నిద్రపోకుండా వుండి మా అమ్మ నిద్ర పోయిన తర్వాత చూదామనుకొన్నాను. బాగా రాత్రి పదకొండుగంట లవుతుంది. నేను కళ్లుతెరిచి చూసేసరికి మా అమ్మ నా పక్కలో లేదు..."

అయితే రాజమహేంద్రములో మీరున్న యింట్లో ఒక్కటే గది కాదూ?"

"అవును. ఆమూల మంచంమీద మా అమ్మా నాన్నా పడుకొని వున్నారు. మెల్లిగా పిల్లిలాగా లేచాను. గదిలో దీపము వెలుగుతూ వుంది. తలుపు సందులలోనుంచి చూశాను. మొదట ఏమిటో అర్థము కాలేదు. ఏమిటో వూహించుకొంటూ పడుకొన్నాను. కొంత సేపయిన తర్వాత యిటు చూశాను అమ్మా నాన్నా కనిపించారు. అక్కడనుంచి ప్రతిరోజూ నిద్రమెలకువ వచ్చినప్పుడల్లా చూస్తూ వుండేదాన్ని. మా బావ ఎప్పుడూ నిద్రపోతుగా వుండేవాడు...మా అక్కయ్య అంటే మాబావ ప్రాణాలు విడిచేవాడు. మా అమ్మను నాన్న ఎప్పుడూ బలవంతము చేసేవాడు. మా అమ్మకు మామీదకంటే మా నాన్న మీద యెక్కువప్రేమ. దీనిఅంతా కారణము అదే ననిపించింది. అట్లా ప్రవర్తిస్తే ఎంతో ఆదరముగా చూస్తారని అనుకొన్నాను. మీరిట్లా - యీ విధముగా అనుకొంటారని ఏమాత్రము తెలిసినా నేను మెదలకుండా మూగముశానమ్మ లాగా ముడుచుకొని వూరుకొనేదాన్ని...ఇప్పుడయినా నామాట నమ్మండి. వెర్రి వెర్రి ఆలోచనలు చేయకండి - ఏమిటట్లా చూస్తారేం..."

"అయితే..."

"అయితే లేదు గియితే లేదు. దీపాలవేళయింది" అంటూ తూపులాంటి చూపుచూసి తుర్రున పారిపోయింది.

---




బెణుకులు, కీళ్ల నొప్పులు, దగ్గు,
జలుబు, ఊపిరి సలుపకుండుట,
వెన్నెముక నొప్పి,
మున్నగు వ్యాధులకు
దివ్యాంజనము

తలనొప్పికి అమృతాంజనము

